క్లుప్తంగా

'గ్రీవెన్స్'కు విశేష స్పందన



వినతులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. పలు సమస్యలు విన్నవించుకున్నారు. ప్రజా వినతుల్లో కొన్నింటిని కె.కె.రాజు వెంటనే పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రైల్వేస్టేషన్‌లో 14 కిలోల గంజాయి సీజ్



గంజాయి నిందితుడితో ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్లో శనివారం అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని రైల్వే భద్రతా దళం సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. 14 కిలోల గంజాయిని సీజ్ చేసి, అతడిని గవర్నమెంట్ రైల్వే పోలీసులకు అప్పగించారు. ఆర్పీఎఫ్ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సిహెచ్.రఘువీర్ ఆదేశాలతో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ కె.అనంతరావు, సిబ్బందితో కలిసి శనివారం విశాఖ రైల్వేస్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంల్లో తనిఖీలు చేస్తుండగా.. గుజరాత్‌కు చెందిన భవేష్ కిషోర్ భాయ్ పండ్యా అనే వ్యక్తి వద్ద అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 14 కేజీల గంజాయిని గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, గంజాయిని సీజ్ చేసి, రిమాండ్ నిమిత్తం జీఆర్పీ సిబ్బందికి అప్పగించినట్లు ఏఎస్‌ఐ అనంతరావు తెలిపారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్ట్

సీతమ్మధార: అరకు నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను ద్వారకా పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. ముంబైకు చెందిన బొమ్మాడి సతీష్ నర్సయ, అరకు ప్రాంతానికి చెందిన జన్ని నాగేశ్వరరావు వద్ద గంజాయి కొనుగోలు చేస్తుంటాడు. నాగేశ్వరరావు నేవల్ డాక్‌యార్డులో అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తూ మర్రిపాలెంలో నివసిస్తున్నాడు. అతడు నగరంలోని అనేక మందిని కలిసి అరకు నుంచి గంజాయి తీసుకొచ్చి బొమ్మాడి సతీష్‌కు విక్రయించేవాడు. ద్వారకానగర్‌లోని సాయిప్రియ లాడ్జిలో ఐదు కిలోల గంజాయితో వారిద్దరు బస చేసినట్లు సమాచారం అందుకున్న ద్వారకా ఎస్‌ఐ శ్రీను.. అక్కడికి వెళ్లి యువకులను అరెస్ట్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేపట్టారు. మధ్యాహ్నం 300 మందికి అన్నదానం చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇది కదా అభివృద్ధి

తహసీల్దార్ కార్యాలయానికి కార్పొరేట్ కళ

- రూ.25 లక్షలతో అన్ని హంగులతో ఆధునికీకరణ
- అధికారులు, సిబ్బందికి ప్రత్యేక గదులు
- ప్రజల కోసం సకల సదుపాయాలు



కార్యాలయంలో హెల్ప్ డెస్క్

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్, ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి కార్యాలయాన్ని కార్పొరేట్ స్థాయిలో ఆధునికీకరించారు. ప్రజలు, ఉద్యోగుల కోసం సకల సదుపాయాలు కల్పించి సుందరంగా తీర్చిదిద్దారు. రూ.25 లక్షలతో కార్యాలయ భవనానికి రంగులు, ఫ్లోరింగ్, సీలింగ్, పెయింటింగ్, ఆర్‌సీసీ రూఫ్, సీసీ రోడ్డు, ఫుట్‌పాత్, ఎలక్ట్రిఫికేషన్, కార్యాలయ ప్రధాన బోర్డు, ప్లాంటేషన్, కొత్త ఫ్యానులు, ప్రత్యేక గదుల ఏర్పాటు వంటి పనులతో కార్యాలయ రూపురేఖలను మార్చివేశారు. ఏడాది కిందటి వరకు చెత్తాచెదారంతో నిండి అధ్వాన స్థితిలో ఉన్న కార్యాలయాన్ని నాటి అర్బన్ తహసీల్దార్ ఆనంద్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్.. ప్రజలు, సిబ్బంది సహకారంతో అందంగా మార్చారు. వీఆర్వోలు, సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు పడకుండా విధులు నిర్వహించేందుకు, రికార్డులు భద్రపరిచేందుకు ప్రత్యేక గదులు సిద్ధం చేశారు. స్పందన కార్యక్రమంతోపాటు ఇతర పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం లేటెస్ట్ కుర్చీలు ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌కు ఒక స్థలం కేటాయించారు.

పచ్చదనం.. విద్యుత్ వెలుగులు

తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పలు రకాల పూల మొక్కలు నాటి పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు చేపట్టారు. కొబ్బరి చెట్లకు జాతీయ జెండా రంగులు వేయించారు. అర్జీదారుల కోసం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించారు. చెత్తను ఎప్పటికప్పుడు పూర్తిగా తొలగిస్తున్నారు. ప్రత్యేక విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ విద్యుద్దీప కాంతుల్లో తహసీల్దార్ కార్యాలయం మెరిసిపోతోంది.

కలెక్టర్ సహకారంతో అభివృద్ధి

సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ అభివృద్ధికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రూ.5 లక్షలు మంజూరు చేశారు. కార్యాలయ సిబ్బందితోపాటు దాతలు అందించిన నిధులు, సహకారంతో కార్యాలయాన్ని ఆధునికీకరించారు.

తహసీల్దార్ కార్యాయలంలో సేవలు

ప్రతి సోమవారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యార్థులు, పిల్లలకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లు, కుటుంబ సభ్యత్వ ధ్రువపత్రాలు, అన్ని ప్రభుత్వ పథకాలకు అవసరమైన పత్రాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. తహసీల్దార్ అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి పత్రాలు మంజూరు చేస్తారు. డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉంటారు.



ఆధునికీకరించిన సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయం




ప్రత్యేక గదిలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్



ప్రజల కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

ప్రజలకు అందుబాటులో సేవలు



తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నాం. గత తహసీల్దార్ ఆనంద్‌కుమార్ కార్యాలయ రూపురేఖలను చక్కగా మార్చి కొత్తదనాన్ని తీసుకొచ్చారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రశాంత వాతావరణం, పచ్చని చెట్లు, విద్యుత్ కాంతులతో కార్యాలయాన్ని తీర్చిదిద్దారు.

– జి.శ్రీరామమూర్తి, తహసీల్దార్

అన్ని సౌకర్యాలు కల్పించాం



ఇటీవల బదిలీపై వెళ్లిన తహసీల్దార్ ఎం.ఆనంద్ కుమార్ చొరవతో సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆధునికీకరణ పనులు పూర్తి చేశాం. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కలెక్టర్ రూ.5 లక్షలతోపాటు దాతల సహకారంతో మరింత అభివృద్ధి చేశాం. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

– త్రినాథ్, డిప్యూటీ తహసీల్దార్

జోరుగా ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు



ఎంటీసీ పాలెం సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు

సీతంపేట: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఒక్క సెంటు ఇంటి స్థల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రతి వార్డులోని సచివాలయాల్లో చురుగ్గా జరుగుతోంది. ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇంటి స్థలంపై సంపూర్ణ హక్కు కల్పించేలా సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసి పత్రాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సచివాలయ అడ్మిన్లకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పించిన విషయం తెలిసిందే. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇది వరకు ఇచ్చిన ఇళ్ల పట్టాలోని లబ్ధిదారుడి వివరాలు, కేటాయించిన స్థలం వివరాలు, హద్దులు ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నారు. జీవీఎంసీ 44వ వార్డు 238 ఎంటీసీ పాలెం సచివాలయంలో అడ్మిన్ రాజేష్, వీఆర్వో సురేశ్వరి ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ జోరుగా జరుగుతోంది.

నేడు ఎరుకుమాంబ అమ్మవారి విగ్రహం ఊరేగింపు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఉత్సవ విగ్రహం ఆదివారం ఉదయం ఊరేగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అల్లిపురంలో తయారు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా దొండపర్తిలోని ఆలయానికి తీసుకొస్తామన్నారు. 17వ తేదీన అమ్మవారికి క్షీరాభిషేకం, జలాభిషేకం నిర్వహించి 18వ తేదీ ఉదయం ప్రాణ ప్రతిష్ట చేస్తారని తెలిపారు.

బీసీల సమస్యలపై వినతి



చైర్మన్ హన్స్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు గూడూరు, పెబ్బిలి

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు గూడూరు వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షుడు పెబ్బిలి రవికుమార్, మహిళా నాయకులతో కలిసి న్యూఢిల్లీలో ఉన్న నేషనల్ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్ ఆహిర్‌ను కలిశారు. బీసీలకు కుల జనగణన జరగాలని, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని, విద్య, ఉద్యోగ అవకాశాలు, ప్రమోషన్లలో రిజర్వేషన్లు, అవుట్ సోర్సింగ్, ప్రైవేటు సంస్థల్లో ఎక్కువగా అవకాశం కల్పించాలని, రుణాలు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేయాలని కోరుతూ పలు సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ఏపీకి వస్తామని, అప్పుడు మీ సంఘాన్ని గుర్తింపు సంఘంగా ఆహ్వానించి మీ సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. సంఘం సౌత్ ఇండియా మహిళా కన్వీనర్ ఆర్.కృష్ణవేణి, జాతీయ కార్యవర్గ సభ్యురాలు బి.పద్మ, ఎం.డి.నజీరా బేగం, జోనల్ మహిళా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజావసరాల కోసం స్థలం శుభ్రత

కొండవాలు వాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి చర్యలు



సత్యసాయినగర్ కొండవాలులో నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది, స్థానికులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సత్యసాయినగర్ కొండవాలు ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలాన్ని ప్రజావసరాల కోసం వినియోగించేలా చూడాలని ఇటీవల కాలనీ వాసులు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్పందించిన ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి ఆ ప్రాంతంలో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు చేపట్టారు. శనివారం జీవీఎంసీ సిబ్బంది ఈ పనులు నిర్వహిస్తున్న సమయంలో.. అవి నచ్చని కొందరు దేవస్థానం సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దేవస్థానం సిబ్బంది, జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకులు ఈ స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ స్థలాన్ని చదును చేయిస్తే ప్రజావసరాల కోసం వినియోగించుకుంటామని అధిక శాతం స్థానికులు మరోసారి తెలియజేశారు. తామంతా కొండపై నివసిస్తున్నామని, ఎవరైనా చనిపోతే పైకి తీసుకెళ్లలేమని, రోడ్డుపై వేయలేమని.. అటువంటి సందర్భాల్లో, రాత్రి వేళల్లో తమ ద్విచక్ర వాహనాలను పార్క్ చేసుకునేందుకు, చిన్న చిన్న కార్యక్రమాల నిర్వహణకు ఈ స్థలాన్ని వాడుకుంటామని కోరారు. స్పందించిన అధికారులు కాలనీ నాయకుల నుంచి హామీ తీసుకుని జీవీఎంసీ సిబ్బంది, సత్యసాయినగర్ వాసుల సహాయ, సహకారాలతో ఈ స్థలాన్ని శుభ్రం చేయించారు.

జనసేన నాయకుల హడావుడి..

అదే సమయంలో అక్కడికి చేరుకున్న జనసేన ఉత్తర నియోజకవర్గ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, వార్డు నాయకుడు తుమ్మల త్రినాథ్‌లు ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూశారు. కాలనీ వాసులు, వైఎస్సార్‌సీపీ, టీడీపీల నాయకులు ప్రజావసరాల కోసం చేస్తున్న ఈ మంచి పనిని అడ్డుకోవడం తగదని తెలియజేయడంతో వారు తిరిగి వెళ్లిపోయారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణోత్సవాలు ప్రారంభం



కల్యాణోత్సవాలను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

సీతమ్మధార: స్థానిక టీపీటీ కాలనీలోని ద్రావిడ సంక్షేమ సంఘం కార్యాలయ ప్రాంగణంలో శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో కల్యాణోత్సవ కమిటీ నేతృత్వంలో శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఘనంగా మొదలయ్యాయి. గురూజీ కె.ఎ.రాజు.ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, వంకాయల సన్యాసిరాజు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ మానవ జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. వేంకటేశ్వర స్వామి కటాక్షం ప్రతి ఒక్కరికిపైన వర్షించాలన్నారు. ద్వారం మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు డా.ద్వారం త్యాగరాజు బృందం ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు భక్తుల హృదయాలను పరవశింపజేశాయి. కోలాటం, సంకీర్తనలు, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కార్యక్రమంలో శృతిలయ సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో నేడు ఘంటసాల వర్ధంతి



కరపత్రికను ఆవిష్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబ ధ్యాన మందిరంలో ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమ వివరాలను తెలిపే కరపత్రికను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గానసుధ గల్లా చిట్టిబాబు బృందం ఆధ్వర్యంలో భక్తిగీతాలాపన కార్యక్రమం జరుగుతుందన్నారు. ధ్యాన మందిర కమిటీ సభ్యులు త్రిపురాన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభ విజయవంతం చేయాలి

సీతంపేట: బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు పెద తాడేపల్లి హైవే పక్కన తాడేపల్లి గూడెంలో జరగనున్న బీసీ బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు పిలుపునిచ్చారు. సీతంపేటలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ హక్కుల సాధనకు జరుగుతున్న ఈ సభలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గోవాలని కోరారు. బీసీలంతా ఒకతాటిపైకి వచ్చి రాజ్యాధికారాన్ని కైవసం చేసుకునే దిశగా పయనించాలన్నారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులో మహిళలకు సబ్ కోటా, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు, కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వ శాఖ, బీసీలకు క్రీమీ లేయర్ డిమాండ్ల సాధనకు బీసీలంతా సమష్టిగా కదలివచ్చి మన శక్తిని చాటాలన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



అధికారులతో కలిసి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార రామాలయం వీధిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పరిశీలించారు. ఈ ప్రాంతంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించి అధికారులకు తగు సూచనలిచ్చారు. స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు. ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 1లో శనివారం గుర్తు తెలియని ఒక వ్యక్తి ఫిట్స్ వచ్చి పడిపోయాడు. ఇతడిని 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఆదేశాలతో ఎస్‌ఐ మధుసూదనరావు కేసు నమోదు చేశారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఇతడి వద్ద ఏ విధమైన ఆధారాలు లేవని, ఈ వ్యక్తి గురించి ఎవరికైనా తెలిస్తే విశాఖ రైల్వేస్టేషన్‌లోని పోలీసులకు గానీ లేదా 94406 27547, 94934 74582 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్‌ఐ కోరారు.

రెండు చోట్ల దొంగతనాలు

- ల్యాప్‌టాప్, రూ.90 వేల నగదు, 2 తులాల నల్లపూసల తాడు చోరీ

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల శనివారం దొంగతనాలు జరిగాయి. వివరాలిలా.. సీతంపేట దుర్గాగణపతి ఆలయం వెనుక రోడ్డులోని ఒక రూమ్‌లో కె.పవన్, వై.శ్రీనివాసరావు, ఎస్.సాయిదుర్గా, మణికంఠ అనే యువకులు అద్దెకు ఉంటున్నారు. వారు ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. రోజులాగే శనివారం గది తాళాన్ని తలుపు పక్కన మేకుకు తగిలించి విధులకు వెళ్లిపోయారు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా.. గది తలుపులు తీసి ఉండటాన్ని గమనించారు. రూమ్‌లో లాప్‌టాప్, ట్యాబ్, రూ.90 వేల నగదు దొంగిలించారని గుర్తించి ద్వారకా క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంటి తాళాలు పగలగొట్టి..: మధురానగర్‌లోని గ్రూప్ హౌస్‌లో ఎస్.వరలక్ష్మి కుటుంబంతో కలిసి నివసిస్తోంది. శనివారం ఇంటికి తాళం వేసి సచివాలయానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం వచ్చి చూడగా.. తలుపు తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగిందని గ్రహించారు. ఇంటి లోపల బీరువాలో ఉన్న సామగ్రి, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. లాకర్‌లో రెండు తులాల బంగారు నల్లపూసల తాడు కనిపించకపోవడంతో ద్వారకా పోలీసులకు వరలక్ష్మి ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి క్రైం డీసీపీ, ఏడీసీపీ, ఇతర పోలీస్ అధికారులు చేరుకుని పరిశీలించారు. ప్రస్తుతం సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. ఈ చోరీలకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలింగ్ బూత్ ఏజెంట్లతో సమావేశం



44వ వార్డులో మాట్లాడుతున్న కె.కె.రాజు, చిత్రంలో బాణాల శ్రీనివాసరావు



53వ వార్డు సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డుకు సంబంధించిన పోలింగ్ బూత్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లోని షాదీఖానాలో శనివారం సమావేశం జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమ్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావుతో కలిసి వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం పార్టీ నాయకులకు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లకు నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు హబీబ్, సీతారాములు, బషీర్, జి.వెంకటరావు, కన్నప్పడు, కిషోర్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కండి

మద్రిపాలెం: రాబోయే ఎన్నికలకు సన్నద్ధం కావాలని బూత్ లెవల్ ఏజెంట్లకు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. 53వ వార్డు పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ బర్కత్ అలీతో కలిసి బీఎల్ఏలు, పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఏలు వారివారి పరిధిలో ప్రజలు పొందిన లబ్ధిని వివరించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టరు, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, హనుమంతు, రామలక్ష్మి, సదరం జ్ఞానేష్, సుశీల, ఝాన్సీ, సుజాత, ఆదిలక్ష్మి, షేక్ నబీ, సత్యారావు, భార్గవ్, సంపత్, భాను, చిన్న, బాలాజీ, జోత్స్న, జయలక్ష్మి, అలీ, అన్సర్ వలీ, గిరీష్, శ్రీదేవి, రాజారావు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ ముఖ్య నాయకులు

మీడియాకు సామాజిక బాధ్యత పెరగాలి



మాట్లాడుతున్న రచయిత, ఏపీ జర్నలిజం కళాశాల డైరెక్టర్ సతీష్ చందర్

సీతంపేట: వాస్తవాలకు అద్దం పట్టేలా మీడియాకు సామాజిక బాధ్యత పెరగాలని రచయిత, ఏపీ జర్నలిజం కళాశాల డైరెక్టర్ సతీష్ చందర్ అన్నారు. దళితుల బతుకులు, వారి జీవితాలు పత్రికల్లో కనిపించాలన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్థాపించిన మూక్‌నాయక్ పత్రికకు 104 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో ‹మీడియా – సామాజిక న్యాయం› అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా దళితులను చైతన్యవంతులను చేసేందుకు అంబేడ్కర్ మూక్‌నాయక్ పత్రికను స్థాపించారన్నారు. దేశంలో తొలి పాత్రికేయుడు అంబేడ్కర్ అని అన్నారు. ఆయన సాధించిన విజయాలను నాటి పత్రికలు పరాజయాలుగా చూపించాయని చెప్పారు. దేశ వ్యాప్తంగా అనేక ఆకృత్యాలు ప్రస్తుతం మీడియాలో కానరావడం లేదన్నారు. అగ్రవర్ణాల చేతుల్లో ఉన్న కొన్ని పత్రికలు పార్టీలకు కొమ్ము కాస్తూ వారిని రాజకీయంగా ప్రోత్సహిస్తున్నాయన్నారు. అణగారిన వర్గాలకు కూడా మాధ్యమాలు ఉండాలని సూచించారు. మతోన్మాద పార్టీలు దేశమంతా దేశభక్తి అంటే రామభక్తి అని ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రధాన మీడియా ఇదే చూపిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు వి.వి.రమణమూర్తి, సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జె.వి.ప్రభాకర్, సీనియర్ జర్నలిస్ట్ జి.కె.డి.ప్రసాద్, ఏయూ ప్రొఫెసర్ పి.డి.సత్యపాల్, డాక్టర్ ప్రసాద్, ప్రొఫెసర్ ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.